సాక్షి
ఖమ్మం
బుధవారం । 4 । అక్టోబర్ । 2023





### కేసీఆర్ సారథ్యాన జిల్లా

సత్తుపల్లి జిల్లా సీఎం కేసీఆర్ సారథ్యాన ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ధీమా వ్యక్తం చేశారు. 8లో



### 'డబుల్' ఇళ్ల ప్రారంభంలో నిరసన

ఖమ్మం 8వ డివిజన్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించగా, అర్హులకు రాలేదని పలువురు నిరసనకు దిగారు. 8లో




### వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### కారేపల్లి కళాశాలలో డీఐఈఓ తనిఖీ



కారేపల్లిలో రికార్డులు తనిఖీ చేస్తున్న రవిబాబు

కారేపల్లి: కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) కె.రవిబాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను పరిశీలించిన ఆయన బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చేస్తూ, ఎంసెట్ తరగతులు బోధించాలని, స్టడీ అవర్స్ నిర్వహించాలని ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలంకు సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

**9వరకు ఇంటర్‌లో ప్రవేశాలు**

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 9వ తేదీ వరకు అవకాశముందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. అర్హులైన విద్యార్థులు రూ.వెయ్యి అపరాధ రుసుముతో ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందొచ్చని ఆయన వెల్లడించారు.

### 13వరకు ప్రవేశాల గడువు పెంపు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### వారబందీ విధానంలో నీరు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: పంటలను కాపాడేందుకు వారబందీ విధానంలో సాగర్ జలాలను విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాగర్ ఆయకట్టు క్రింద రైతులు వరి, పత్తి, మిర్చి పంటలను సాగు చేయగా.. వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్నాయని తెలిపారు. ఫలితంగా పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యాన వారబందీ పద్ధతిలో సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని ఆయన అధికారులను కోరారు.

### విధుల్లో చేరిన డీఏఓ విజయనిర్మల

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఎం.విజయనిర్మల మంగళవారం విధుల్లో చేరారు. ఆగస్టు మూడో వారంలో ఆమె సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు బి.సరితకు పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వర్తించారు. కాగా, విజయనిర్మల తిరిగి విధుల్లో చేరగా, ఆమెకు సరిత బాధ్యతలు అప్పగించారు.

### ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు



ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీఐ కళాశాలల కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో http/iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాలుగో విడత వరకు దరఖాస్తు చేసుకుని సీటు రాని వారు, సీటు వచ్చినా చేరని దరఖాస్తు చేసుకుని, ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

### దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ఆపై కోర్సులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి టి.సుమ తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన విద్యార్థులు డిసెంబర్ 31లోగా కులం, నివాసం, ఆదాయం, సదరమ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, కళాశాల బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత దరఖాస్తు కాపీని కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అలాగే, ఒకటి నుంచి 10 వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె వెల్లడించారు.

# హోరాహోరీ

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో** బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దూకుడు పెంచాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు గాను ఆ పార్టీ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తూనే కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెడుతుండగా.. కాంగ్రెస్ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అలాగే బీఆర్‌ఎస్ విధానాలను ఎండగడుతున్నారు. మరో వారంలోగా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందన్న ప్రచారంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు, కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న ఆశావహులు తమ కార్యక్రమాల్లో వేగం పెంచారు. గతనెల 30న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఖమ్మం, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించగా.. కాంగ్రెస్ నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ, పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



**ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్**

- అన్నిచోట్లా దూకుడు పెంచిన పార్టీలు
- మంత్రి కేటీఆర్ పర్యటనతో బీఆర్‌ఎస్‌లో జోష్
- కార్యకర్తలతో మమేకమవుతున్న భట్టి, పొంగులేటి

**నువ్వా.. నేనా?**

జిల్లాలో పరిశీలిస్తే బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీసీఎం, సీపీఐ, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుపై చర్చలు జరుగుతున్నాయి. పొత్తులు ఎలా ఉన్నా ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని భావిస్తున్నారు. గతంలోనూ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోగా... ఆతర్వాత స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటింది. ఈక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు ఇటీవల పెరిగాయి. జిల్లాలోని పది నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నారు.

**కేటీఆర్ పర్యటనతో ఊపు**

గత నెల 30న మంత్రి కేటీఆర్ ఖమ్మం, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఊపు వచ్చింది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంతోపాటు మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో దళితబంధు పథకాన్ని అమలు చేస్తామని ఆయన ప్రకటించారు. దీంతోపాటు దాదాపు రూ.1,797 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పలు సభల్లో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ పాలించిన సమయంలో ఏం చేసిందో చెప్పాలని నిలదీయడమే కాక తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

**వ్యూహాత్మకంగా బీఆర్‌ఎస్**

ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ముందుగానే పది నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించి ప్రచార వ్యూహాన్ని కూడా సిద్ధం చేస్తోంది. ఎక్కువ సమయం ప్రజల్లో ఉండాలని పార్టీ అభ్యర్థులు, నేతలకు అధిష్టానం సూచనలు చేస్తోంది. రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నిత్యం ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు రఘునాథపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. అలాగే, డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ కార్యకర్తలకు సూచనలు చేస్తున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కూడా క్షేత్రస్థాయి పర్యటనల్లో వేగం పెంచారు. గతంలో వైరా నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి మదన్‌లాల్, ఎమ్మెల్యే రాములునాయక్ మధ్య కొంత దూరం ఉన్నా... పెద్దల జోక్యంతో వివాదం సమసిపోయి ఇద్దరూ కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు.

**కాంగ్రెస్ దూకుడు**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దూకుడును ప్రదర్శిస్తోంది. ఉమ్మడి జిల్లాలో గతం నుంచే కాంగ్రెస్‌కు బలం ఉంది. ప్రస్తుతం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వంటి నేతల చేరికతో బలం మరింత పెరిగినట్లయింది. ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధిరతోపాటు ఇతర నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ఇక పొంగులేటి కొత్తగూడెం, పాలేరు నియోజకవర్గాలతోపాటు ఇతర నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తూ ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇక నేలకొండపల్లిలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం నిరుద్యోగ నిరసన దీక్ష నిర్వహించారు. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తుతూ కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కుతుండడంతో నోటిఫికేషన్ రాకముందే జిల్లాలో ఎన్నికల వేడి రాజుకున్నట్లయింది.

# కానుక రెడీ..



మహిళలకు పంపిణీ చేయనున్న చీరలు (ఫైల్)

- నేటి నుండి బతుకమ్మ చీరలు పంపిణీ
- జిల్లాకు 4.27 లక్షల చీరల కేటాయింపు
- ఇప్పటికే 3.81 లక్షల యూనిట్లు సిద్ధం
- కేఎంసీ వద్ద పంపిణీని ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ పండుగ సమీపిస్తున్న వేళ... ఏటా మాదిరిగానే మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 14 నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానుండగా, ముందుగానే మహిళలకు కానుకగా చీరలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో బుధవారం చీరల పంపిణీని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభిస్తారు. అలాగే, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో చీరల పంపిణీని మొదలుపెడతారు.

**ప్రతి ఒక్కరూ పండుగ చేసుకోవాలని..**

తెలంగాణ ఏర్పడ్డాక దసరా పండుగకు ప్రాధాన్యత పెరిగింది. తంగేడు పూలతో అలంకరించిన బతుకమ్మలతో మహిళలు తొమ్మిది రోజుల పాటు ఆడిపాడనుండగా.. ప్రభుత్వం అధికారికంగా వేడుకలు వైభవంగా నిర్వహిస్తోంది. ఈక్రమంలోనే మహిళలు పేద, గొప్ప తేడా లేకుండా సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో తెల్ల రేషన్‌కార్డు కలిగిన పేదలకు చీరల పంపిణీని ప్రారంభించింది. ఈ ఏడాది కూడా చీరల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 5,00,562 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా ప్రభుత్వం 4.27 లక్షల చీరలను మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే 3,81,450 చీరలు చేరుకున్నాయి.

**మండలాలకు చేరిన చీరలు**

కొన్నాళ్లుగా జిల్లాకు వస్తున్న చీరలను గోదాంల్లో భద్రపరిచారు. అయితే, ప్రభుత్వం బుధవారం నుంచి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించగా.. అధికారులు మంగళవారం గోదాముల నుంచి కేఎంసీ, మున్సిపల్ కేంద్రాల్లోని డివిజన్లు, వార్డులతో పాటు మండలాల్లోని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఆయా చీరలను రేషన్ దుకాణాల పరిధిలోని మహిళలకు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ పండుగ రాకముందే ప్రతీ మహిళకు కానుక అందించాలనే లక్ష్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు చర్యలు చేపట్టారు.

**మండలాల వారీగా చేరిన చీరలు**

| మున్సిపల్/మండలం | చీరల సంఖ్య |
|---|---|
| ఖమ్మం మున్సిపాలిటీ | 69,510 |
| ఖమ్మం రూరల్ | 23,160 |
| తిరుమలాయపాలెం | 20,520 |
| కొణిజర్ల | 20,040 |
| ముదిగొండ | 19,170 |
| నేలకొండపల్లి | 18,960 |
| సింగరేణి | 17,340 |
| సత్తుపల్లి | 16,770 |
| కూసుమంచి | 16,590 |
| రఘునాథపాలెం | 16,320 |
| కల్లూరు | 16,200 |
| మధిర | 16,050 |
| తల్లాడ | 14,370 |
| కామేపల్లి | 14,160 |
| చింతకాని | 13,080 |
| పెనుబల్లి | 12,930 |
| ఎర్రుపాలెం | 12,390 |
| వైరా | 11,130 |
| వేంసూరు | 11,070 |
| బోనకల్ | 10,890 |
| ఏన్కూర్ | 10,770 |

**అంతా సిద్ధం చేశాం..**



జిల్లాలో బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశాం. బుధవారం నుంచి అధికారికంగా అన్ని మండలాల్లో ప్రజాప్రతినిధులు చీరల పంపిణీని ప్రారంభిస్తారు. గ్రామాల వారీగా కేటాయించిన చీరలను ఇప్పటికే చేరవేశాం. పండుగ ప్రారంభం నాటికి అందరికీ చీరలు పంపిణీ చేస్తాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

# కర్ణాటకలో హామీలన్నీ నెరవేర్చాం..



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

- ఇక్కడ కూడా 'గ్యారంటీలు' అమలుచేసి చూపిస్తాం
- టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: ప్రజలకు ఏం కావాలో, వాళ్లేం కోరుకుంటున్నారో తెలుసుకుని ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక అమలుచేస్తామని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లిలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు కర్ణాటకలో ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయని, తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలుచేసి చూపిస్తామని చెప్పారు. పార్టీలో ప్రతీ ఒక్కరికి మంచి భవిష్యత్ ఉంటుందని, అరవై రోజులు కష్టపడితే అధికారంలోకి తీసుకురావొచ్చని పొంగులేటి చెప్పారు. కాగా, బెదిరించి బలవంతంగా కండువా కప్పినంత మాత్రాన కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కడకు వెళ్లరని.. తిరిగి సొంత గూటికే వస్తారని శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు ఎమ్మెల్యేగా గెలిపిస్తే మేలు చేస్తాడని భావించగా.. గెలుపునకు సహకరించిన వారిపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పలు గ్రామాల వారు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు స్వర్ణకుమారి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, నెల్లూరి భద్రయ్య, కె.గోవిందరావు, ఎం.వెంకన్న, చెరువు స్వర్ణ, చిదుముల జానారెడ్డి, జి.రామారావు, వి.శ్రీనాథ్, ఏ.గురువయ్య, మార్తి కోటి, బి.వేణు, మోహన్‌రెడ్డి, ఆర్.నారాయణరావు, చిదుముల మానస, కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలూ ఆత్మగౌరవంతో జీవించాలని..

- అర్హులదరికీ 'డబుల్' ఇళ్లు కేటాయించాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించిన మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మంఅర్బన్: నిరుపేదలు కూడా ఆత్మగౌరవంతో జీవించాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని, అందుకు అనుగుణంగానే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టించి పేదలకు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో రూ.5.80 కోట్లతో నిర్మించిన 91 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరి కొంత డబ్బు, సామగ్రి ఇచ్చి చేతులు దులుపుకోకుండా అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. అలాగే, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని మంత్రి చెప్పారు.

**చెక్కుల పంపిణీ**

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ పథకాలకు సంబంధించి చెక్కులను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 68 మందితో పాటు బీసీలు 42మందికి ఆర్థిక సాయం, మైనార్టీలు 26మందికి ఆర్థిక చేయూత ద్వారా చెక్కులను అందజేశాక మంత్రి మాట్లాడారు. పేదల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలను క్యాంపు కార్యాలయం వేదికగా అందించామని తెలిపారు. ఆతర్వాత 34వ డివిజన్‌లో రంగనాయకుల గుట్ట వద్ద రూ.63.99 లక్షలతో నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. అలాగే, 30, 51, 52వ డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్యాంప్రసాద్, కార్పొరేటర్లు ముక్కాల కమల, బుర్రి వెంకట్ కుమార్, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, పసుమర్తి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌ఏల బదిలీలు పూర్తి

**జిల్లాలో 723 మందికి స్థానచలనం**



ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. అయితే, ప్రక్రియ గందరగోళంగా సాగిందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 723మంది స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ జరగగా, ఇందులో జెడ్పీ స్కూళ్ల పరిధిలో 619 మంది, ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 104మంది ఉన్నారు. వీరికి మంగళవారం ఉత్తర్వులు అందజేసిన అధికారులు బదిలీలు పారదర్శకంగా పూర్తిచేశామని వెల్లడించారు. కాగా, స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో తెలుగు, హిందీ ఉపాధ్యాయులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు మినహా మిగతా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు.

**సతాయించిన సర్వర్**

ఉపాధ్యాయుల బదిలీల సమయాన వెబ్‌సైట్‌లో సర్వర్ మొరాయించడంతో ఆప్షన్స్ ఇచ్చే విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎడిట్ చేసుకునే సమయాన కూడా ఇదే పరిస్థితి ఎదురైందని చెబుతున్నారు. అయితే, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చాక, వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయక వీరి పేర్లను తొలగించడం సాధ్యం కాలేదు. ఈక్రమంలో కొత్తవారు చేరేందుకు సమస్యలు ఎదురవడంతో డీఈఓ కార్యాలయం ఉద్యోగులు ఉన్నతాధికారుల సహకారంతో పరిష్కరించారు. చివరి వరకు తుది జాబితాను ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. ఓవైపు కోర్టు కేసులతో అసలు బదిలీలు జరుగుతాయా, లేదా అనే సందేహం నెలకొనగా.. విద్యాశాఖ అధికారులు జాబితా రూపకల్పనలోనూ ఆలస్యం చేయడం గమనార్హం. ఏది ఏమైనా మంగళవారంతో ఎస్‌ఏల బదిలీల ప్రక్రియ ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### మెడికల్ కాలేజీకి 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభం కావడంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అవసరమైన బోధన సిబ్బందిని కేటాయిస్తోంది. తాజాగా 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను కాలేజీకి కేటాయించారు. వీరి నియామకానికి సంబంధించి కౌన్సెలింగ్ జరుగుతుండగా పది రోజుల్లో వారు విధుల్లో చేరనున్నారు. ఇప్పటివరకు కళాశాలకు ఆరుగురు ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను కేటాయించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేశ్వరరావు తెలిపారు.

### డెంగీ మహమ్మారిని తరిమేద్దాం

నేలకొండపల్లి: జిల్లా నుంచి డెంగీ మహమ్మారిని తరిమేసేలా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి సూచించారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశాక మాట్లాడారు. సీజనల్ జ్వరాల బారిన పడకుండా ప్రజలు ఇళ్లలోనే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు 315 డెంగీ కేసులు నమోదు కాగా, నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు 'వైట్‌కోట్'

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం వైట్‌కోట్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కిరణ్‌కుమార్, సరిత, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓ బి.శ్రీనివాసరావు ప్రారంభించగా.. విద్యార్థులకు వైట్‌కోట్లు అందజేశారు. అనంతరం ఎలాంటి పక్షపాతం లేకుండా రోగులకు సేవ చేస్తామని ప్రమాణం చేయించారు. అలాగే, అనాటమీ విభాగంలో మృతదేహాలకు పూలమాలలు వేయించి 'మృతదేహం మా ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.. దీన్ని ఎప్పుడూ చులకనగా చూడం.. మొదటి గురువుగా భావిస్తాం..' అంటూ ప్రమాణం చేయించి మృతదేహాలను కళాశాలకు అందజేసిన వారి కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బోధన సిబ్బంది పాల్గొన్నారు.



మృతదేహం వద్ద విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

## క్లుప్తంగా

### ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల కమీషన్ పెంపు


కేంద్ర మంత్రితో ఎంపీ రవిచంద్ర, డీలర్లు

ఖమ్మం మయూరిసెంటర్: ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు ఇచ్చే కమీషన్‌ను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించింది. ఒక్కో సిలిండర్‌పై ఇప్పుడు ఇస్తున్న దానికి అదనంగా రూ.7.23 చెల్లించనున్నారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ, పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల్లోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఢిల్లీలో కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరీని కలిశారు. మంత్రితో పాటు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రమేష్ బిధూరి పలు సమస్యలను తీసుకెళ్లగా కేంద్రం కమీషన్ పెంచిందని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం బాధ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇతర ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉత్తమ పీఎస్‌గా మధిర రూరల్

- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- జాబితాలో కొత్తగూడెం త్రీటౌన్, ఖమ్మం వన్ టౌన్‌కూ స్థానం


మధిర రూరల్ పోలీసుస్టేషన్

మధిర: కేసుల పరిష్కారంతో పాటు పలు అంశాల ప్రాతిపదికన రాష్ట్రంలోని ఉత్తమ పోలీసు స్టేషన్ల జాబితాను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఇందులో అత్యంత పరిశుభ్రమైన పోలీస్‌స్టేషన్‌గానే కాక, మహిళలతో పాటు ఇతర కేసుల పరిష్కారంలో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈమేరకు 30పోలీసుస్టేషన్లతో జాబితా విడుదల చేయగా, 48.67 పాయింట్లతో మధిర రూరల్ పీఎస్ మొదటి స్థానం దక్కించుకుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం త్రీటౌన్ పీఎస్ 44,87 పాయింట్లతో 19వ స్థానంలో, ఖమ్మం వన్‌టౌన్ స్టేషన్ 43.55 పాయింట్లతో 27వ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఈ మూడు స్టేషన్లకే స్థానం దక్కింది.ఈమేరకు మధిర సీఐ వసంత్‌కుమార్, ఎస్సై ఎం.డీ.ఉపాతుల్ రఫీ, సిబ్బందిని పలువురు అభినందించారు.

### కొణిజర్లలో కొనసాగుతున్న పికెట్

కొణిజర్ల: మండల కేంద్రంలో సోమవారం రాత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యాన ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్ మంగళవారం కూడా కొనసాగింది. వైరా సీఐ సాగర్‌నాయక్ పర్యవేక్షణలో కొణిజర్ల, వైరా, చింతకాని పోలీస్ సిబ్బంది పికెట్ నిర్వహించారు. కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావుపై దాడి చేసిన బస్వాపురం యువకుడు కొణిజర్లలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణ యజమాని ఇంట్లో ఉన్నాడన్న సమాచారంతో ఇంటిపై దాడి చేసే అవకాశముందని తెలియగా అక్కడ కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు దాడికి గురైన సర్పంచ్ రామారావును పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

### డ్రెయినేజీలో పడిన బాలుడికి గాయాలు

సత్తుపల్లిటౌన్: డ్రెయినేజీలో పడిన ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి శ్రీనివాస టాకీస్ రోడ్డులో అసంపూర్తిగా వదిలేసిన సైడ్ డ్రెయినేజీలో మంగళవారం పాఠశాలకు వెళ్తున్న ఫజిల్ ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో స్థానికులు గమనించి బయటకు తీసి తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించారు. డ్రెయినేజీ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

### ఐదు స్మార్ట్ ఫోన్లు చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని కేశవపట్నంకు చెందిన బి.గోపికి చెందిన ఐదు స్మార్ట్ ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. మంగళవారం తెల్లవారుజామున అంతా నిద్రిస్తుండగా దుండగులు చొరబడి ఫోన్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 8,225 | 4,100 |
| మిర్చి | 19,000 | 13,500 |
| ఏసీ మిర్చి | 24,000 | 18,500 |
| తాలు మిర్చి | 8,000 | 6,000 |
| పత్తి | 7,050 | 4,400 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.12,231 |

# కేసీఆర్ సారథ్యాన సత్తుపల్లి జిల్లా

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


సత్తుపల్లి : గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: రాష్ట్రంలో పది జిల్లాలను 33 జిల్లాలుగా చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యాన సత్తుపల్లిని జిల్లా కూడా ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. సత్తుపల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మునిసిపాలిటీ పరిధిలో 23 వార్డులకు చెందిన 520 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను ఆయన అందజేశాక మాట్లాడారు. సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతోనే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అటవీశాఖ స్థలం కేటాయించేలా కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కే.రఫీతో పాటు చల్లగుండ్ల కృష్ణయ్య, మట్టా ప్రసాద్, వేములపల్లి మధు, విజయనిర్మల, అద్దంకి అనిల్, శ్రీను, ఆనందరావు, నాగుల్‌మీరా, నాన్ని, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**కళ్ల ముందే అభివృద్ధి**

సత్తుపల్లిరూరల్: ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని.. అభివృద్ధి మొత్తం కళ్ల ముందే కనిపిస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, రేగళ్లపాడు, యాతాలకుంట, నారాయణపురం, రేజర్ల గ్రామాల్లో రూ.22.14 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రూ.వెయ్యి కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 90శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు, గొర్రెల పంపిణీ చేయకపోగా, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎందుకు నిర్మించలేదో ఆ పార్టీ నేతలను నిలదీయాలని సూచించారు. ఎంపీపీ దొడ్డా హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతోపాటు ఏగోటి పెద్దిరాజు, తుంబూరు శ్రీరాంప్రసాద్, నాగార్జున, పుష్పవతి, కృష్ణారెడ్డి, మోదుగు పుల్లారావు, కంచర్ల నాగయ్య, దొడ్డా శంకర్‌రావు, ఖాదీర్‌సాబ్ పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం**

వేంసూరు: అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. వేంసూరులో ఆయన గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశాక మాట్లాడారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావుతో పాటుట పుచ్చకాయల శంకర్‌రెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, మందపాటి మహేశ్వరెడ్డి, గంగ్ర సోమిరెడ్డి, మందపాటి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు


ర్యాలీలో ఎంపీ నామా, ఎమ్మెల్యే రాములునాయక్, అభ్యర్థి మదన్‌లాల్

ఏన్కూరు: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఖాయమని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. అయితే, కార్యకర్తలు ఆషామాషీగా భావించకుండా ప్రతీ బూత్‌లో అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఏన్కూరులో మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొనగా కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వైరా ఎమ్మెల్యే లావుడియా రాములునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ వైరా ఎమ్మెల్యేగా మదన్‌లాల్ గెలిపించడం ద్వారా ప్రత్యర్థులకు చెక్ పెట్టాలని సూచించారు. సమస్యలేమైనా ఉంటే తాను చూసుకుంటానని, కార్యకర్తలు మాత్రం గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఏన్కూరు జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు బాదావత్ బాలాజీ, చిర్రా రుక్మిణి, భూక్యా శివప్రసాద్, భద్రమ్మ, వెంకయ్య, హరికృష్ణ, సింహాద్రియాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పతనం దిశగా ఆయిల్‌పామ్

- ఈనెల గెలల ధరలో టన్నుకు రూ.795 మేర కోత
- ఆందోళనలో రైతులు


ఆయిల్‌పామ్ గెలలు

అశ్వారావుపేటరూరల్: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు నెలనెలా ఆయిల్‌పామ్ గెలల ధర పడిపోతోంది. ధర భారీగా పతనమవుతున్న నేపథ్యాన సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఫ్యాక్టరీలకు రైతుల నుంచి గెలలను సేకరిస్తుండగా, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు కొన్ని నెలలుగా స్వల్పంగా తగ్గుతున్నా ఈనెల భారీగా పడిపోయింది. గతేడాది జూన్‌లో ఆయిల్ పామ్ గెలల టన్ను ధర రూ.23,467, జూలైలో రూ.20,267గా ఉంది. ఆ తర్వాత నుంచి నానాటికీ పతనమవుతోంది. ఈ ఏడాది ఆరంభం నుంచి రూ.10వేల మార్కుకు పైగానే ఉన్నా రైతులు ఆశించిన స్థాయిలో మాత్రం పెరగకపోగా ప్రతినెలా తగ్గుతోంది. ఈనెల టన్నుకు ఏకంగా రూ.795 తగ్గి రూ.13,026 నుంచి రూ.12,231కు పడిపోయింది. ధర భారీగా తగ్గిన నేపథ్యాన వివరాలు వెల్లడించేందుకు ఆయిల్‌ఫెడ్ అధికారులు సుముఖత చూపడం లేదు.

**ఈ ఏడాదిలో పతనమే ఎక్కువ..**

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు కేవలం నాలుగు నెలల్లో మాత్రమే ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర స్వల్పంగా పెరగగా, మిగిలిన అన్ని నెలల్లోనూ తగ్గింది. జనవరిలో టన్ను ధర 13,781 కాగా, ఫిబ్రవరిలో రూ.180 పెరిగి రూ.13,961కి చేరింది. ఇక మార్చిలో రూ.18 తగ్గగా, ఏప్రిల్‌లో మళ్లీ రూ.262 పెరిగి రూ.14,205గా నమోదైంది. అలాగే, మే నెలలో రూ.858, జూన్‌లో రూ.723 తగ్గడం గమనార్హం. ఆ తర్వాత జూలైలో రూ.468 పెరగగా, ఆగస్టులో రూ.65, సెప్టెంబర్‌లో రూ.795 చొప్పున తగ్గింది. ఇదే ధర అక్టోబర్‌లో అమలవుతుంది. ఈనెల ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.795 చొప్పున తగ్గడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే దిశగా ధరలు తగ్గితే సాగుపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అయితే, ఇప్పటి వరకు ఆయిల్ పామ్ సీజన్ కాకపోవడం, అంతర్జాతీయంగా చమురు ధరల పతనంతోనే గెలల ధర తగ్గిందని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. కానీ సెప్టెంబర్ నుంచే గెలల దిగుమతి పెరిగినా ధర పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

# 'డబుల్' ఇళ్ల ప్రారంభంలో నిరసన

- మంత్రి పువ్వాడ కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నం
- ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట


ఆందోళన చేస్తున్న వారిని పక్కకు తప్పిస్తున్న పోలీసులు


పోలీసులు, బీఆర్ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగిన ఆందోళనకారులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీలో మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. అయితే, అర్హులకు ఇళ్లు కేటాయించలేదని ఆరోపిస్తూ పలువురు ఆందోళనకు దిగారు. ఈక్రమంలో మంత్రి పువ్వాడ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని పక్కకు తప్పించి వాహనాలను పంపించారు. అధికార పార్టీ వారికి కాకుండా అర్హులైన వారందరికీ ఇళ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. కాగా, ఆందోళన చేస్తున్న వారికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలపడంతో పోలీసులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు వారిని పక్కకు తప్పించారు. ఈక్రమంలో తోపులాట, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. అయితే, ప్రారంభ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం తనను ఆహ్వానించలేదని స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులు నిరసన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, పోలీసులపై కొందరు మహిళలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ అర్హులైన తమకు ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దాడి గర్హనీయం**

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని వైఎస్సార్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించలేదని, జాబితాలో ఉన్న కొందరి పేర్లు తొలగించాలని కాంగ్రెస్ కార్పొరేటర్‌తో పాటు పలువురు అడిగితే పోలీసులతో దాడి చేయించడం గర్హనీయమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బాధితులపై దాడి చేయడమే కాక కేసులు నమోదు చేయడం సరికాదని తెలిపారు. ఇకనైనా అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడమే కాక తమ శ్రేణులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### బీఎస్పీ వైరా అభ్యర్థిగా రాంబాబు


రాంబాబునాయక్

వైరా: బహుజన్ సమాజ్‌వాదీ(బీఎస్పీ) పార్టీ వైరా నియోజకవర్గ అభ్యర్థిగా బానోత్ రాంబాబు నాయక్‌ను ఎంపిక చేశారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. రాంబాబుకు రాజకీయ అనుభవం లేకున్నా, ఉన్నత విద్యనభ్యసించడంతో పాటు సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని టికెట్ కేటాయించినట్లు తెలిసింది.

**కుటుంబ నేపథ్యం**

ఖమ్మం రూరల్ మండలం కస్నా తండాకు చెందిన రాంబాబు ఇంజనీరింగ్ అనంతరం హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయనకు భార్య కల్యాణితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో పనిచేసిన ఆయన, ట్రైబల్ వెల్ఫేర్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, స్వేరోస్ సెంట్రల్ కమిటీ సభ్యుడి వ్యవహరించారు. గత ఏడాదిగా బీఎస్పీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న రాంబాబు మాట్లాడుతూ బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అంబేద్కర్ ఆశించిన సమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

**పాలేరు అభ్యర్థిగా అల్లిక**


వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: బీఎస్పీ పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా అల్లిక వెంకటేశ్వరరావును ప్రకటించారు. ఖమ్మం రూరల్ మండలంలోని గూడురుపాడుకు చెందిన ఆయన పేరును ఖరారు చేసినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్


దీక్షలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన నాగేశ్వరరావు తదితరులు

నేలకొండపల్లి: ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, నియామక పరీక్షల్లో అవకతవకలకు కారణమైన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం చేపట్టిన నిరుద్యోగ నిరసన దీక్షాశిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారడంతో నిరుద్యోగులకు న్యాయం జరగలేదని తెలిపారు. తొలిసారి పేపర్ లీకేజీ జరిగినప్పుడే బోర్డును రద్దు చేస్తే రెండో సారి రద్దుచేయాల్సి పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావిద్, నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మొక్క శేఖర్ గౌడ్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, బోయిన వేణు, జెర్రిపోతుల సత్యనారాయణ, శాఖమూరి రమేష్, గూడవల్లి రాంబ్రహ్మం, నెల్లూరి భద్రయ్య, గరిడేపల్లి రామారావు, కుక్కల హనుమంతరావు, ఆరెకట్ల గురవయ్య, మార్తి కోటి, లక్కం ఏడుకొండలు, ముత్తినేని వీరయ్య, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దీక్షలోభాగంగా టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యాన నాయకులు రాస్తారోకో చేపట్టగా ఉద్రిక్తత నెలకొంది. ఖమ్మం-కోదాడ రహదారిపై ఆందోళన చేపట్టగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పినా నాయకులు వినలేదు. చివరకు నేతలను అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో గందరగోళం నెలకొంది.

# కార్పొరేట్ల ప్రయోజనం కోసమే హైవే..


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసితులు

ఖమ్మం సహకారనగర్: నాగపూర్ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే వేస్తున్నారని.. సామాన్యులకి ఈ రహదారితో ఎలాంటి ఉపయోగం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈ రహదారికి తాజాగా ప్రధాని శంకుస్థాపన చేసిన నేపథ్యాన భూనిర్వాసితుల జేఏసీ ఆధ్వర్యాన ఖమ్మం ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలు, సామాన్యులకు ఉపయోగపడని హైవే నిర్మాణం ఎందుకు చేపడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్చాలని రైతులు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో ఈ రహదారికి ప్రత్యామ్నాయంగా కురవి – కోదాడ రోడ్డును పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ తక్కెళ్లపాటి భద్రయ్య, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బొంతు రాంబాబు, పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూసేకరణ పూర్తికాకుండా, రైతులకు పరిహారం ఇవ్వకుండా శంకుస్థాపన చేయటం సరికాదన్నారు. అనంతరం డీఏఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘాలు, జేఏసీ నాయకులు మాదిని రమేష్, ఎస్.నవీన్‌రెడ్డి, మీరాసాహెబ్, వాసిరెడ్డి వరప్రసాద్, వేములపల్లి సుధీర్, మందనపు రవీంద్ర, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీధర్, వేముల సతీష్, పెంట్యాల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, భోజట్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన అశ్వారావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పాల్వంచకు చెందిన చాటల సంపత్‌కుమార్, భార్య విష్ణుతులసితో కలిసి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేటకు వచ్చారు. తిరిగి పాల్వంచ వెళుతుండగా స్థానిక సత్తుపల్లి రోడ్‌లో ఎదురుగా వచ్చిన టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలకు గాయాలు కాగా, చిట్టితల్లి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

### వివాహిత హత్య

**చున్నీతో ఉరి వేసి చంపిన భర్త**

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల శివారు శ్రీనిధి వెంచర్‌లో నివాసముంటున్న నందికొండ కవిత(46)ను ఆమె భర్త శివకుమార్ చున్నీతో ఉరి వేసి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఘటన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడెంకు చెందిన కవితకు గతంలో ఓ వ్యక్తితో వివాహం జరగగా ఆయనతో విడిపోయింది. ఆతర్వాత పరిచయమైన హైదరాబాద్‌కు చెందిన శివకుమార్‌ను రెండో వివాహం చేసుకోగా శ్రీనిధి వెంచర్‌లో ఉంటున్నారు. కాగా, కవితకు తన పుట్టింటి ద్వారా కొంత ఆస్తి సంక్రమించింది. ఈ విషయమై ఇరువురి మధ్య కొంతకాలంగా ఘర్షణ జరుగుతోంది. అయితే, 1వ తేదీన రాత్రి గొడవ పెరగడంతో శివకుమార్ ఆవేశంగా కవిత మెడను చున్నీతో బిగించి హత్య చేశాడు. ఆతర్వాత ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా, మంగళవారం వారి ఇంటి నుండి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు సర్పంచ్‌కు చెప్పగా ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు చేరుకుని కవిత మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. కాగా, నిందితులు ఖమ్మం టూటౌన్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది.

# ఐదు శాతం ఐఆర్.. ఉద్యోగులను వంచించడమే


ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సైదులు



రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ధనిక రాష్ట్రమని చెబుతూ ఐదు శాతం ఐఆర్ ప్రకటించడం ఉద్యోగులు, ఉపాధ్యాయులను వంచించడమేనని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు పి.నాగిరెడ్డి, దేవరకొండ సైదులు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రకటనను నిరసిస్తూమంగళవారం పాఠశాలల్లో మంగళవారం నిరసన తెలపగా, సాయంత్రం ఖమ్మంలో కమిటీ బాధ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి, సైదులు మాట్లాడుతూ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి ఐదు శాతం ఐఆర్ ప్రకటించడం గర్హనీయమన్నారు. ఇకనైనా కనీసం 15 శాతం ఐఆర్ ప్రకటించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్ విజయ్, జి.యాదగిరి, ఎస్.కే.మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐఆర్ కనీసం 15శాతానికి పెంచాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు కోరారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ నియమించడాన్ని స్వాగతిస్తున్నా, 5శాతమే మధ్యంతర భృతి ప్రకటించటం అసంతృప్తిని కలిగించిందని పేర్కొన్నారు. ఈసమావేశంలో తిరునగిరి స్వామి, సాంబశివరావు, వెంకటరమణ, పద్మ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంరాపర్తినగర్: రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ ఐదు శాతం ప్రకటించడం సరికాదని, దీన్ని 18 శాతానికి పెంచడమే కాక జూలై 1 నుంచి అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ -రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.గోపీచంద్, కల్యాణం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఐఆర్ పెంచడమే కాక పెండింగ్ డీఏలు విడుదల చేయాలనే తదితర డిమాండ్లతో ఈనెల 12న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో వీరబాబు, మధుసూదనరావు, రవికుమార్, స్వామి, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, రాములమ్మ, ఉమాదేవి, ఉమేష్, అలీఖాన్ పాల్గొన్నారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పెన్షనర్ల భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐఆర్‌ను 15శాతానికి పెంచాలన్నారు. ఈసమావేశంలో డీకే.శర్మ, టి.జనార్దన్‌రావు, పి.సాంబశివరావు, వీరయ్య, తాళ్లూరి వేణు, ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బకాయిల చెల్లింపుపై తీర్పు వాయిదా

## రూ.6,756.92 కోట్లు ఇవ్వాల్సిందే అంటున్న ఏపీ

- చెల్లింపుపై గతంలో ఇచ్చిన స్టేను పొడిగించాలన్న తెలంగాణ
- వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలన్న ఏపీ
- సీజే ధర్మాసనం వద్ద వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదంలో హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలంటూ ఏపీ.. దీనిపై ఇప్పటికే ఇచ్చిన స్టేను పొడిగించాలంటూ తెలంగాణ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా వాదనలు వినిపించగా.. హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వు చేసింది.

### కేంద్రం ప్రకటన నేపథ్యంలో

రాష్ట్ర విభజన తర్వాత సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తమకు తెలంగాణ నుంచి రూ.6,756.92 కోట్లు (అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) రావాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఏపీకి 30రోజుల్లోగా రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు వేశాయి. వాటిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. బకాయిల విషయంలో తెలంగాణ సర్కార్‌పై ఒత్తిడి తేవొద్దని స్టే ఇచ్చింది. ఈ వ్యవహారం ఇలా కోర్టులో ఉండగానే.. విద్యుత్ బకాయిలు తప్పకుండా చెల్లించాలని ఆదేశించినా తెలంగాణ ఇవ్వడం లేదని.. అందువల్ల రిజర్వు బ్యాంకులోని తెలంగాణ ఖాతా నుంచి సొమ్మును మినహాయించుకుని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చింది. దీనితో కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని, చెల్లింపులపై స్టేను పొడిగించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులోని ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది.

### ముందు విభజన సమస్యలు తేల్చాలంటూ..

తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై పూర్తిగా చర్చించకపోవడంతో ఈ ఇబ్బంది మొదలైందని వివరించారు. వివిధ అంశాల్లో ఏపీ కేంద్రానికి సహకరిస్తోందని.. అందువల్ల ఆ రాష్ట్రానికి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండగానే.. కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అసలు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 92 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదని వివరించారు.

### బకాయిల వల్ల ఇబ్బందుల్లో ఏపీ డిస్కమ్‌లు

తెలంగాణ బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ విద్యుత్ డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వచ్చిందని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పునర్విభజన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన ఈ బకాయిలకు, పునర్విభజన చట్టానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు కూడా ఏపీ డిస్కమ్‌లు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేశాయన్నారు. బకాయిలు చెల్లించక బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, తెలంగాణకు విద్యుత్ నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని గుర్తు చేశారు. ఇక.. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకిరణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని, బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు రిజర్వు చేసింది.

# కాంగ్రెస్, బీజేపీలను పాతర పెట్టాలి

- గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- పీసీసీ అంటే పేమెంట్ కలెక్షన్ సెంటర్
- బీజేపీని నమ్ముకుంటే అధోగతే



సిద్దిపేట జిల్లా కొండపాకలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'పీసీసీ అంటేనే పేమెంట్ కలెక్షన్ సెంటర్. బీజేపీని నమ్ముకుంటే అధోగతే. ఈ రెండు పార్టీలను పాతాళంలో పాతర పెట్టాలి. ఉచిత కరెంటు, మూడు పంటలు, ధాన్యపు రాశులు కావాలంటే కేసీఆర్ వెంటే నడవాలి..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రూ.540 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల తీరుపై మండిపడ్డారు. గత కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులతో క్యూలు కట్టిన రోజులు రైతులు నేటికీ మరిచిపోలేదన్నారు. కరెంట్ సక్రమంగా రాక పంటలు ఎండిపోయి అన్నదాతలు అప్పుల పాలయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. తప్పుదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉచిత కరెంట్ ఆగమైతదని రైతులు గుర్తించారని చెప్పారు. బీజేపీ వల్ల కూడా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని ముందుకు సాగటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, ఆయన గజ్వేల్‌లోనే ఉండాలనుకుంటే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కానుకగా అందించే బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ గృహలక్ష్మి పథకం కింద 10 వేల ఇళ్లను మంజూరు చేశారని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌కు పలు సంఘాల మద్దతు

గజ్వేల్ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. గజ్వేల్ ఆర్యవైశ్య సంఘం, కుమ్మరి సంఘం, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, పద్మశాలి సంఘాలు ఈ మేరకు చేసిన తీర్మానాలను మంత్రి హరీశ్‌రావుకు అందించాయి.

# కాంగ్రెస్‌ది గతం.. ఇప్పుడు ఖతం!

- వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుంది?
- మోదీని కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరు
- బీజేపీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి
- జగిత్యాల సభలో మంత్రి కేటీఆర్



జగిత్యాల జిల్లా నూకపల్లిలో కేటీఆర్‌కు స్వీట్ అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుని కుమారుడు

జగిత్యాల, జగిత్యాల క్రైం, ధర్మపురి, సిరిసిల్ల, సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది గతమని, ఇప్పుడా పార్టీ ఖతమైందని, వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. 150 ఏళ్ల కాంగ్రెస్ వారంటీ అయిపోయిందని, ఆరు గ్యారంటీలు ఇస్తే ప్రజలు నమ్ముతారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు 24 గంటల కరెంట్‌పై అనుమానం ఉందని, జగిత్యాల నియోజకవర్గానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దరిద్రం పోతుందని వ్యాఖ్యానించారు.

### రేవంత్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్

రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్ అని, ఆ పార్టీ నేత పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సోనియాకు సైతం లేఖ రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. బీజేపీ మతపిచ్చి పార్టీ అని, జనాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవడమే ఆ పార్టీకి తెలుసని ధ్వజమెత్తారు. పీఎం మోదీని సీఎం కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరని, మాకు ఆ పార్టీతో, మోదీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మోదీది గాడ్సే వారసత్వమని ఆరోపించారు.

### బీఆర్ఎస్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరమని, కాంగ్రెస్ అంటే శనీశ్వరమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాతాశిశు ఆస్పత్రితోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. నరేంద్రమోదీ అంటే నమ్మించి మోసం చేసేవాడని విమర్శించారు. కాగా జగిత్యాల జిల్లాకేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హోం మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు.

### ఒక్క రూపాయి లంచం లేకుండా..

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ 577 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు, 1,747 మందికి గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి కలిగే విధంగా కేసీఆర్ పాలన వర్ధిల్లుతోందన్నారు.

### మోదీ అబద్ధాల జాతర

**ఎక్స్(ట్విట్టర్)లో మంత్రి కేటీఆర్ ధ్వజం**

పీఎం నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలనే కాకుండా 140 కోట్ల మంది భారతీయులను మోసం చేశారని మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో ధ్వజమెత్తారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి విభజన హామీలకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. మూడు రోజుల వ్యవధిలో రెండోసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ విభజన హామీలకు పదేళ్లుగా పాతరేసి అబద్ధాల జాతర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వంద స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్‌కు వీడ్కోలు

- ముగిసిన పదవీకాలం
- పొడిగింపులేక తప్పుకున్న బాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చైర్మన్‌గా పదవీకాలం ముగియటంతో ఆ పదవి నుంచి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తప్పుకున్నారు. మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వరకు బాజిరెడ్డి ఆ పదవిలో కొనసాగుతారని ఆర్టీసీ వర్గాలు భావించాయి. కానీ, పదవీకాలం ముగిసినా ప్రభుత్వం నుంచి పొడగింపు ఆదేశాలు వెలువడలేదు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఆశాభంగం కలిగిన సిట్టింగ్‌లను బుజ్జగించేందుకు ఆర్టీసీ చైర్మన్ పదవి లాంటి వాటిని వారికి అప్పగించవచ్చని, అందుకే బాజిరెడ్డికి కొనసాగింపు అవకాశం ఇవ్వలేదన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇక్కడి బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో బాజిరెడ్డికి వీడ్కోలు సమావేశం జరిగింది. బాజిరెడ్డి దంపతులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. రెండేళ్ల పదవీకాలంలో, ఆర్టీసీ అభ్యున్నతికి బాజిరెడ్డి ఎంతో కృషి చేశారంటూ అధికారులు కితాబిచ్చారు. ''రెండేళ్లపాటు ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేయటం, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆర్టీసీని బాగు చేసేందుకు ఎండీ సజ్జనార్‌తో కలిసి కృషి చేయడం జీవితంలో మరవలేను. నేను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం నాకు ఎంతో సంతోషం కలిగించింది'' అని బాజిరెడ్డి పేర్కొన్నారు.

# 6న ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ, యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పరికరాల కిట్లను అందచేసే కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో మంగళవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి అల్పా హార పథకాన్ని సీఎం కేసీఆర్ రంగారెడ్డి జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తారని, ఈ నెల 14 నాటికి బతుకమ్మ చీరెల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు.

**జిల్లా వార్తలు**

## విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



బాలికకు సైకిల్ అందజేస్తున్న చెంగలరావు, తదితరులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యాన సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ చెంగలరావు మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సేవాసంస్థలు చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఐటీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్‌తో పాటు భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా బాలికల ఖో-ఖో జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా ఖో-ఖో బాలికల జట్టు

కల్లూరు: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో బాలికల జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. పోటీలకు 150 మంది హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన 15 మందితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఇన్‌చార్జ్ పీడీ నరసింహమూర్తితో పాటు పత్తిపాటి నివేదిత, స్టెల్లా నిరంజన్, పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు. కాగా, బుధవారం బాలుర జట్టు ఎంపిక చేయనున్నారు.

## రేపు ఖమ్మంలో జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో శ్రీసాయి అగ్రి టెక్నాలజీస్ బాధ్యులు పాల్గొని వంద మందిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 19నుంచి 32 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత ఉన్న వారు హాజరుకావాలని సూచించారు.

# కోటి లింగాల సంకల్పం !



పార్థివ లింగాల తయారీలో పాల్గొంటున్న కర్ణాటక, స్థానిక మహిళలు



తయారుచేసిన పార్థివ లింగాలు

## పాల్వంచలో 5లక్షల మట్టి లింగాల తయారీ

- సేవలో నిమగ్నమైన వివిధ రాష్ట్రాల భక్తులు
- కాశీలో కోటి లింగాల అభిషేకార్చన ద్వారా గిన్నిస్ రికార్డ్ లక్ష్యం

పాల్వంచ: కోటి శివ పార్థివ లింగాల తయారీ సంకల్ప సేవ ముమ్మరంగా సాగుతోంది. రాష్ట్రంలోని చారిత్రక శివాలయాల్లో ఈ లింగాల తయారీ సేవలో భక్తులు పాల్గొంటున్నారు. స్వహస్తాలతో లింగాల తయారీని భక్తులు అదృష్టంగా భావిస్తుండగా, పాల్వంచలోని ప్రాచీన శ్రీ ఆత్మలింగేశ్వరాలయానికి తాకిడి పెరుగుతోంది. ఈ సేవకు కర్ణాటక రాష్ట్రం నుంచి మహిళలు సైతం రావడం విశేషం. ఇక్కడి ఆలయంలో 5లక్షల లింగాలు తయారు చేయాలని నిర్వాహకులు సంకల్పంగా నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీశ్రీశ్రీ విజయానంద నాద గురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తంగిరాల రామచంద్ర సాయి ఆధ్వర్యాన శివ సంకల్పమస్తు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ శివాలయాల్లో లింగాలను తయారు చేయిస్తుండగా.. అవసరమైన మట్టి, ఇతర సామగ్రిని సంస్థే సమకూర్చింది. అన్ని ఆలయాల్లో తయారు చేసిన కోటి లింగాలను కాశీ పుణ్యక్షేత్రానికి తరలించి అక్కడ ప్రపంచంలోనే మొదటి సారిగా కోటి పార్థివ లింగాలకు అభిషేకార్చన నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పాల్వంచలోని ఆదర్శ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు కంచర్ల విమల ఆధ్వర్యాన మహిళలు, భక్తులు సేవలో పాల్గొంటున్నారు.

### భక్తులకు వసతి

అచ్చుల సాయంతో మట్టితో పార్థివ లింగాలను రూపొందిస్తున్నారు. అనంతరం వీటిని ఆరబెట్టి ట్రేలో పేరుస్తున్నారు. ఇలా బాక్స్‌ల్లో నింపి కాశీకి తరలించనున్నారు. కాగా, లింగాల తయారీకి వచ్చిన ఇతర రాష్ట్రాల భక్తులకు ఆలయ నిర్వాహకులు మచ్చా శ్రీనివాసరావు ఆధ్వర్యాన భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

### తయారీలో పాల్గొనడం అదృష్టం



కోటి పార్థివ లింగాలు తయారు చేసే కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిసి పాల్వంచలోని శ్రీఆత్మలింగేశ్వరాలయానికి వచ్చాం. ఇక్కడే పదిహేను రోజులు ఉండి సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. మా చేతులతో స్వయంగా లింగాలను తయారు చేస్తుండడం అదృష్టంగా భావిస్తున్నాం.

– పార్వతి, రాయచూర్, కర్ణాటక

### నెల రోజుల పాటు..



సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 30 వరకు లింగాలు తయారు చేయనున్నాం. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పాల్వంచ ఆలయంలో 5లక్షల లింగాలు తయారు చేయనున్నాం. అనంతరం కార్తీకమాసంలో కాశీలో అభిషేకార్చన నిర్వహించనున్నాం.

– కంచర్ల విమల, ఆదర్శ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు

### ఎంతో పుణ్యఫలం



లింగాలను తయారు చేయడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాం. గిన్నిస్ బుక్ రికార్డ్ కోసం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోటి లింగాలు తయారుచేశాక కాశీలో అభిషేకార్చన నిర్వహిస్తారు. ఆలయ నిర్వాహకులు మాకు అన్ని ఏర్పాట్లు చేశారు.

– అనురాధ, కర్ణాటక

# నాలుగు ఏరియాల్లోనే వంద శాతం



సత్తుపల్లి సమీపంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్

- సింగరేణిలో గడిచిన నెల 91 శాతం ఉత్పత్తి
- ఓసీల్లో 94, భూగర్భగనుల్లో 74శాతంగా నమోదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని భూగర్భగనులు, ఓసీల్లో ఆగస్టులో వంద శాతం బొగ్గు ఉత్పత్తి నమోదు కాగా.. సెప్టెంబర్‌లో మాత్రం వెనకబడింది. గత నెల ఆరు ఏరియాలు వంద శాతం ఉత్పత్తి సాధించగా, ఈసారి నాలుగు ఏరియాల్లోనే సాధ్యమైంది. సింగరేణి వ్యాప్తంగా 19 ఓపెన్‌కాస్ట్ గనుల్లో సెప్టెంబర్‌లో 45,30,444 టన్నులకు గాను 42,54,162 టన్నులు(94 శాతం), 24 భూగర్భగనుల్లో 6,43,171 టన్నులకు 4,78,536 టన్నుల(74 శాతం) బొగ్గు ఉత్పత్తి నమోదైంది. మొత్తంగా 51,73,615 టన్నుల లక్ష్యానికి గాను 47,32,698 టన్నులు(91శాతం) ఉత్పత్తి నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### ఆ ఏరియాల్లో ఓకే...

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు గాను కేవలం నాలుగు ఏరియాలు వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. ఇల్లెందు ఏరియాలో 146 శాతం, బెల్లంపల్లిలో 145, కొత్తగూడెంలో 116, మణుగూరు ఏరియాలో 112 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఇక మిగతా ఏడు ఏరియాలను వెనుకబడ్డాయి. కాగా, గడిచిన ఆరు నెలల్లో పరిశీలిస్తే సంస్థ నిర్దేశించిన 31.97 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 31.14 మిలియన్ టన్నుల(97 శాతం) ఉత్పత్తి సాధించగలిగారు. ఈ ఆరు నెలల్లో కొత్తగూడెం రీజియన్‌లోని ఇల్లెందు ఏరియా 128శాతంతో మొదటి స్థానంలో నిలవగా, మణుగూరు ఏరియాలో 125 శాతం, బెల్లంపల్లి ఏరియాలో 123 శాతం, కొత్తగూడెం ఏరియా 114 శాతంతో ఆతర్వాత స్థానాలు దక్కించుకున్నాయి.

**ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి వివరాలు**

| ఏరియా | లక్ష్యం | ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| ఇల్లెందు | 13,64,520 | 17,40,546 | 128 |
| మణుగూరు | 53,46,154 | 66,58,176 | 125 |
| బెల్లంపల్లి | 14,42,308 | 17,72,966 | 123 |
| కొత్తగూడెం | 58,94,904 | 67,24,200 | 114 |
| ఆర్జీ-3 | 24,14,231 | 23,87,167 | 99 |
| ఆర్జీ-1 | 20,32,996 | 19,19,186 | 94 |
| ఆర్జీ-2 | 41,32,069 | 37,25,288 | 90 |
| మందమర్రి | 20,87,384 | 18,07,618 | 87 |
| శ్రీరాంపూర్ | 30,73,865 | 25,27,809 | 82 |
| భూపాలపల్లి | 21,40,846 | 13,48,421 | 63 |
| అడ్రియాల ప్రాజెక్ట్ | 8,68,096 | 4,74,136 | 55 |

# నేడు తపాలా ఉద్యోగుల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ సర్కిల్ జీడీఎస్‌పీ జేసీఏ చైర్మన్ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. ఈసమ్మెలో బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల విధానం, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎం.రాంప్రసాద్, వి.శ్రీనివాసరావు, వై.పట్టాభిరామయ్య, వై.సతీష్, పుల్లారావు, రామయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు హైదరాబాద్‌కు పాల ఉత్పత్తిదారులు

ఖమ్మంవ్యవసాయం: హైదరాబాద్ రావిరాలలో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మెగా డెయిరీని గురువారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పాడి పరిశ్రమ సహకార సంఘాలకు చెందిన రైతులను తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లాలాపేటలో 5లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన డెయిరీ ఉండగా, అధునాతన పరిజ్ఞానంతో మరో 8లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మెగా డెయిరీని నిర్మించారు. ఈ డెయిరీ ప్రారంభోత్సవానికి రెండు జిల్లాల నుంచి 30 మంది పాల ఉత్పత్తిదారులను తీసుకెళ్తున్నట్లు డీడీ కుమార స్వామి తెలిపారు.

# కాంపోజిట్ సిలిండర్లతో భద్రత



సిలిండర్లు అందజేస్తున్న అంకుర్

సత్తుపల్లిటౌన్: ఇండెన్ గ్యాస్ నూతనంగా గృహ వినియోగదారుల కోసం ప్రవేశపెట్టిన కాంపోజిట్ సిలిండర్‌తో భద్రత లభిస్తుందని సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సేల్స్ ఆఫీసర్ అంకుర్ తెలిపారు. సత్తుపల్లిలోని శ్రీహనుమాన్ దత్తసాయి ఇండెన్ గ్యాస్ కార్యాలయంలో వినియోగదారులకు మంగళవారం ఆయన కాంపోజిట్ సిలిండర్లు అందజేసి మాట్లాడారు. ఇవి సాధారణ సిలిండర్ల కంటే 50శాతం తక్కువ బరువు ఉంటాయని, గ్యాస్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చూసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీల నిర్వాహకులు గుండు ఉమామహేశ్వరరావు, శశాంక్, వందనపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.